క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలతో సీసీ రహదారుల నిర్మాణం



తోటగూడెం వద్ద సీసీ రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఘంటా ప్రసాదరావు

పెదపాడు: పెదపాడు పెరికీడు రహదారి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పరిశీలించారు. పెదపాడు మండలంలోని తోటగూడెంలో నిర్మాణం చేస్తున్న సీసీ రహదారి పనుల నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. రహదారి నిర్మిస్తున్న విధానాన్ని కాంట్రాక్టరును అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు కత్తుల రవికుమార్, విజిలెన్స్ మోనటరింగ్ సెల్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్ కొండపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొఠారును కలిసిన ఎస్సై స్వామి



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై స్వామి

దెందులూరు: దెందులూరు ఎస్సై కే.స్వామి బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, కేసులు పెండింగ్‌లు లేకుండా, ట్రాఫిక్ సమస్యలు, ఇతర శాఖాపరమైన సమస్యలపై అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే కొఠారు ఎస్సైకు సూచించారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

పేకాట, కోడిపందేల స్థావరంపై దాడి

పెదవేగి : కోడిపందేలు పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం పెదకడిమిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, 10 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. పినకడిమిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కూచింపూడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1000 నగదు, కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విజయరాయిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.9,500 నగదు, కవ్వగుంటలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి, రూ.2,700 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెకుముకి పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు

ఉంగుటూరు: జన విజ్ఞాన్ వేదిక వారి అధ్వర్యంలో ఏలూరు బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలో పాల్గొని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కైకరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 10వ తరగతికి చెందిన నందినీ ప్రియ, 9వ తరగతికి చెందిన నాగ సాయి పవన్‌కుమార్, 8వ తరగతికి చెందిన కె.ఖ్యాతి ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు. జిల్లాస్థాయి ప్రతిభా పరీక్షలో తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సైన్స్ ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాస్‌కుమార్, కునాతి జాన్, బి.సీతారాములు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం

పెదపాడు: పాతముప్పర్రులో మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల సంరక్షణ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీఓ సీహెచ్ సూర్య చక్రవేణి మాట్లాడుతూ బాల్యవివాహాల నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాలల రక్షణాధికారి రాజేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని అన్నారు. క్రాప్ ఎన్‌జీవో ప్రతినిధి ఎస్ రవిబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది మహిళా సంరక్షణ కార్యదర్శి ఏ మహాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు సంప్రదాయాలను తెలుసుకోవాలి



పెదపాడు: వట్లూరులో భోగి మంట వెలిగిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు



పెదవేగి: అమ్మపాలెం పాఠశాలలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న దృశ్యం, చిత్రంలో డీఈవో శ్యామ్ సుందర్

- జిల్లా విద్యాశాఖాధికారి పి శ్యామ్ సుందర్
- పాఠశాలల్లో ముందుగానే సంక్రాంతి వేడుకలు





భీమడోలు: అన్నేవారిగూడెంలో భోగిమంటలు వేస్తున్న టీచర్లు, భీమడోలులో గొబ్బెళ్ల చుట్టూ నృత్యం చేస్తున్న చిన్నారులు



పెదవేగి: కొప్పాకలో విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో చిన్నారుల సందడి

పెదవేగి : తెలుగు వారి సంప్రదాయాలు ప్రతిబింబించే సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి శ్యామ్ సుందర్ చెప్పారు. సోమవారం పెదవేగి మండలం అమ్మపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, కొప్పాక ఉన్నత పాఠశాలలో సంక్రాంతి వేడుకలు వైభోపేతంగా నిర్వహించారు. తెలుగు వారికి ఇష్టమైన సంక్రాంతి సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి పి శ్యామ్ సుందర్, మండల విద్యాశాఖాధికారి–2 అరుణ్ కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.సుజాత, గ్రామ ఎంపీటీసీని పంచాయతీలోని మూడు పాఠశాలల టీచర్లను, సచివాలయ సిబ్బందిని ఈ వేడుకలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అరుణ్‌కుమార్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులను అభినందించారు. కొప్పాల పాఠశాల హెచ్‌ఎం ఆర్ శైలజ, ఉపాధ్యాయులు ఈ సంబరాల్లో విద్యార్థులతో కలిసి సంబరాలు నిర్వహించారు. పినకడిమి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు సోమవారం అంబరాన్నంటాయి. పాఠశాల సంక్రాంతి సెలవుల ముందు రోజైన సోమవారం పాఠశాలల్లో సంబరాలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల, భీమడోలు–3, వడ్లపట్ల, ఆగడాలలంక, కె.అంబర్‌పేట, ఎంఎంపురం, కోడూరుపాడు, పాఠశాలల్లో బాలబాలికలు పాఠశాల ప్రాంగణాల్లో రంగవల్లులు, గొబ్బిళ్లను పువ్వులతో ఆలంకరించి ముస్తాబు చేసారు. వారంతా వాటి చుట్టూ లయబద్ధంగా పాటలు పాడుతూ ఉల్లాసంగా నృత్యాలు చేసారు. భోగి పండ్లు, గొబ్బి పాటలు పాటి భోగి మంటలు వేసారు. చిన్నారులకు భోగి పండ్లు పోసారు. హరిదాసుల కీర్తలు పాడి చిన్నారులు ఆహూతులను ఆకట్టుకున్నారు. రైతుల వేషధారణల్లో ఆలరించారు. బాలికలు సంప్రదాయ దుస్తులను ధరించి నృత్యాలు చేసారు. దీనితో పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు ఎస్‌కే మస్తాన్, రెడ్డియ్య, టీచర్లు ఎం.విజయకుమారి, మేరీ ప్రసాద్, ఎం.స్వర్ణలత, సీహెచ్ రమాజ్యోతిబస్, ఎం.దుర్గాప్రసాదిని, వై.ఝాన్సీ, ఎం.రవిభారతి, పి.శారారాణి, కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఉప్పాకపాడులో సంక్రాంతి సంబరాలు

ఉంగుటూరు: ఉప్పాకపాడు ప్లస్ 1 పాఠశాలలో సంక్రాంతి సంబరాలు సోమవారం నిర్వహించారు. భోగి మంటలు వేశారు. సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు ఆకట్టుకున్నారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంప్రదాయ వేషధారణతో ఆకట్టుకున్న నలుగురికి ఉపసర్పంచి మాస్తాన్ వల్లి బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్, ఉపాధ్యాయులు అల్లు శ్రీను, శ్రీదేవి దుర్గ పర్యవేక్షించారు.

పాఠశాలల్లో సందడి

పెదపాడు: మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, వట్లూరులోని సిద్ధార్థ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వట్లూరులో నిర్వహించిన వేడుకలలో ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు పాల్గొని చిన్నారులకు భోగి పండ్లు పోసా రు. అనంతరం భోగి మంటలను వెలిగించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హెచ్‌ఎం పీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

జల్లికొమ్మరలో ముందస్తు సంబరాలు

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. జల్లికొమ్మర పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సీఎం జగన్



వేగవరంలో పింఛన్ అందజేస్తున్న ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్



రాజమండ్రిలోని మహంకాళికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

దెందులూరు: అన్ని వర్గాల పేదల పాలిట పెన్నిధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రూ. 3 వేల పెన్షన్ ప్రతి నెలా అందిస్తూ ఇంట్లో పెద్ద కొడుకులా అందరి గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం వేగవరంలో వృద్ధాప్య పింఛన్లు బెజవాడ చంద్రమ్మకు, ప్రత్యేక అవసరాల పెన్షనర్ల బేతపూడి లక్ష్మీబాకు కొఠారు రామచంద్రరావు, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇంటేటి గంగాధరబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, ఏనుగు రామాంజనేయులు, నాయకులు తోట పద్మారావు, మాగంటి కృష్ణమోహన్, మొర్ల సుబ్బారావు, నిట్టా గంగరాజు, మొర్లపద్దయ్య, వార్డు మెంబర్లు ఉన్నారు.

రాజమండ్రి వెళ్లి వృద్ధునికి పింఛన్ అందజేత

భీమడోలు: దుద్దేపూడి సచివాలయం పరిధిలోని అన్నేవారిగూడెం వలంటీర్ అల్లే శివకృష్ణ సోమవారం తన పరిధిలోని వృద్ధుడు పోతుపోయిన మహంకాళికి వైఎస్సార్ పింఛన్ కానుక నగదును రాజమండ్రి ఆసుపత్రికి వెళ్లి అందజేశాడు. అన్నేవారిగూడెంకు చెందిన పోతుపోయిన మహంకాళి అనారోగ్యంతో బాధపడుతూ రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛన్‌ను తీసుకునేందుకు రాలేని స్థితిలో ఉన్న ఆయనకు వలంటీర్ రాజమండ్రి ఆసుపత్రికి వెళ్లి రూ.3వేల నగదును అందించాడు.

కోడిపందేలు, పేకాటపై ప్రత్యేక నిఘా



కొత్తూరులో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ

దెందులూరు: కోడిపందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వెంటనే వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఏలు, తహసీల్దార్, ఎస్సై, సీఐలకు సమాచారాన్ని వెంటనే అందించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎస్సై కే.స్వామి అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోడిపందేలు, పేకాటను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వో, వీఆర్ఏ, గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల నుంచి మండల, జిల్లా అధికారులు నిరంతర తనిఖీలతో పాటు ప్రత్యేకాధికారులు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా కోడిపందేలు, పేకాట జరగకుండా గ్రామ స్థాయి ఉద్యోగులు తమ వంతు తోడ్పాటు ఇవ్వాలని ఎస్సై కే. స్వామి కోరారు.

పెదపాడు: కోడిపందేలు, పేకాట, గుండాట వంటివి నిషేధమని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. పెదపాడు మండలంలోని తోటగూడెంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు

గణపవరం: కోడి పందేలు, జూదాలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని గణపవరం సీఐ సుభాష్ అన్నారు. గణపవరం మండలం పిప్పరలో గ్రామ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎస్సై, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత బస్ ప్రయాణం హామీ ఇవ్వవద్దు

గణపవరం/నిడమర్రు: రాజకీయ పార్టీలు ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణాలు వంటి హామీలతో ఆటోవాలాలకు ఉపాధి దెబ్బతింటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గణపవరం ఏరియా డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత బస్ ప్రయాణ హామీలకు వ్యతిరేకంగా ఆటోవాలాలు ఆందోళన నిర్వహించారు. గణపవరం సెంటర్‌లో నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వాసుబాబు క్యాంపు కార్యాలయ ప్రతినిధి అడపా రవికి, టీడీపీ, జనసేన నాయకులకు వినతిపత్రాలు అందజేశారు. పి.పెద్దిరాజు, టీవీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. నిడమర్రు మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు అబ్రహం, ఉపాధ్యక్షుడు అన్నవరంతోపాటు ఆటో వాలాలు పెదనింద్రకొలను, బువ్వనపల్లి, అడవికొలను గ్రామాల రూట్‌లో ఆటోలు బంద్ నిర్వహించి నిరసన శిబిరాల్లో ఆందోళనలు నిర్వహించారు.

కౌలు రైతులకు పంట రుణాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఉంగుటూరు: కౌలు రైతులకు వడ్డీలేని రబీ పంట రుణాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. సోమవారం కైకరంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వకుండా మొండి చేయి చూపడం తగదన్నారు. జిల్లా రుణ ప్రణాళికలో మూడు శాతానికి మించి పంట రుణాలు కౌలు రైతులకు అందడంలేదన్నారు. గడిచిన ఖరీఫ్‌లో 32 వేల మంది కౌలు రైతులకు రూ.142కోట్లు పంట రుణాలుగా ఇచ్చి నట్లు బ్యాంకర్లు లెక్కలు చెబుతున్నా ఆచరణలో కౌలు రైతుల దామాషా ప్రకారం రుణాలు మంజూరు కావడం లేదన్నారు. జిల్లాలో 60శాతం భూములు సాగుచేస్తున్న కౌలు రైతులకు జిల్లా రుణ ప్రణాళిక నుంచి కౌలు రైతుల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పా రావు, జిల్లా కో–కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు పూర్తి



ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

దెందులూరు: ఉంగుటూరు నుంచి చింతలపూడి నియోజకవర్గాల మధ్య ఉన్న గ్రామాల పరిధిలో 48 కిలోమీటర్లు రోడ్డు మరమ్మతుకు ఇప్పటి వరకు 18 కిలోమీటర్ల మరమ్మతులు పూర్తి చేశారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఇటీవల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు లక్కవరం ఎంపీటీసీ డీ.మోహన్‌రెడ్డి, సోషల్ మీడియా కోకన్వీనర్ పాపారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లి ప్రసాద్‌రెడ్డి, చేబ్రోలు నుంచి దేవులపల్లి వరకు రోడ్లను ఆధునికీకరించాలని కోరడంతో వెంటనే ఆర్ అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం సూపరింటిండెంట్ ఇంజనీర్ ఇప్పటి వరకు 18 కిలోమీటర్ల మేర మరమ్మతులు పూర్తి చేశారని తెలిపారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నేతలకు వివరించారు. అనంతరం మోహన్‌రెడ్డి, పాపారావు, ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకున్న ఎంపీకి వేంకటేశ్వరస్వామి ఫొటోను అందించి కృతజ్ఞతలు తెలిపారు.

'ఆడుదాం ఆంధ్ర' యువతకు వరం



శ్రీరామవరంలో క్రీడాకారులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: ఆడుదాం – ఆంధ్ర కార్యక్రమం యువతకు వరమని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం శ్రీరామవరంలో యువతకు ఆడుదాం– ఆంధ్ర క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఉపసర్పంచ్ కనుమూరి సావిత్రి, దెందులూరు గ్రామ కార్యదర్శి ఏఎస్ చౌదరి ఉన్నారు.

30 కిలోల రాగి తీగ చోరీ

ఏలూరు టౌన్: దుగ్గిరాల పంచాయతీ పరిధిలో ఒక పొలంలో ఉన్న 33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 30 కేజీల రాగి వైరును చోరీకి గురైంది. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుగ్గిరాల పంచాయతీ పరిధిలో చింతమనేని శ్రీరంగ సతీష్ కుమార్ పొలంలో విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసింది. ఈనెల 5న గుర్తు తెలియని దొంగలు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి 30 కేజీల రాగి వైరును చోరీ చేశారు. దీనిపై విద్యుత్‌శాఖ విజయరాయి ఏఈ పి.శ్రీనివాస్ ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. రాగి వైరు విలువ సుమారు రూ.1,30,000 ఉంటుందని అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

లింగపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎంపీ సీటును వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం లింగపాలెంలో గెస్ట్ హౌస్ వద్ద వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బీవీఎస్ రెడ్డిని దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై మరలా వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్ పాలనతో ప్రజలకు సంక్షేమ రాజ్యం కొనసాగుతుందన్నారు. రెండోసారి జగన్‌మోహనరెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. కుల, మత, వర్గ భేదం లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను దేశంలోని ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. నేడు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పి విజయబాబు, లింగపాలెం, ధర్మాజీగూడెం సొసైటీల చైర్మన్లు భీమిరెడ్డి సోమిరెడ్డి, ఉప్పలపాటి వరప్రసాద్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, యడవల్లి, అన్నపనేనివారిగూడెం సర్పంచ్‌లు కె రమేష్, డి రవీంద్ర, పార్టీ నాయకులు బి.ప్రభాకరెడ్డి, రావి కొండయ్య, పి వేమనరెడ్డి, నూతులపాటి శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఉంగుటూరు: గోపీనాథపట్నంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. సచివాలయ కన్వీనర్ గంటా లక్ష్మణరావు, గంటా వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్లా లక్ష్మణరావు మృతి తీరని లోటు

పెదపాడు: వసంతవాడకు చెందిన మట్టా లక్ష్మీ ప్రసాద్ మృతి వైఎస్సార్ సీపీకి తీరనిలోటని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు మండలంలోని వసంతవాడకు చెందిన లక్ష్మీ ప్రసాద్ ఈనెల 2న గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో పాటు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్,అయూబ్‌ఖాన్ తదితరులు లక్ష్మీ ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. ఉపసర్పంచ్‌గా, గోగుంట సొసైటీ సభ్యుడిగా పనిచేసి పార్టీలో తనదైన ముద్ర వేసుకున్నారని గుర్తుచేసారు. పెదపాడు వీఆర్వో కే నటరాజన్ దాసు తండ్రి కోటేశ్వరరావు ఆదివారం రాత్రి మరణించడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు.

కోటేశ్వరరావుకు ఘన నివాళి

ఉంగుటూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కైకరంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బల్లిరెడ్డి కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కోటేశ్వరరావు కుమారులు చిన్నారావు, శివకుమార్, అన్నదమ్ములు బల్లిరెడ్డి రామకృష్ణ, అప్పారావును సోమవారం ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ శ్రీధర్ పరామర్శించారు. కోటేశ్వరరావు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను పాల్గొన్నారు.